# వీధికుక్కల దాడి, నిరాశ్రయ వృద్ధురాలి దుస్థితిపై మానవ హక్కుల కమిషన్ సుమోటో విచారణ




**హైదరాబాద్, జూన్ 20 (ప్రజా మంటలు):** తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్సీ) న్యాయ సభ్యురాలు శ్రీమతి శివడి ప్రవీణ రెండు వార్తా కథనాలను స్వప్రేరితంగా (సుమోటో) విచారణకు స్వీకరించారు. సాక్షి దినపత్రికలో జూన్ 20న ప్రచురితమైన వార్తల ఆధారంగా ఈ చర్యలు చేపట్టారు. హెచ్ఆర్సీ నెం.2468/2026 కింద, వరంగల్ నగరంలోని శాలినీనగర్‌లో వీధికుక్క దాడిలో రెండేళ్ల చిన్నారి పాయల్ తీవ్రంగా గాయపడిన ఘటనను కమిషన్ తీవ్రంగా పరిగణించింది. బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందించిన సహాయం, వీధికుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టనున్న చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. హెచ్ఆర్సీ నెం.2469/2026లో, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని శివాజీచౌక్ వద్ద దయనీయ స్థితిలో రోడ్డుపై జీవిస్తున్న ఓ గుర్తుతెలియని వృద్ధ మహిళ పరిస్థితిపై కమిషన్ స్పందించింది. ఆమెను గుర్తించి రక్షించడం, వైద్య చికిత్స, పునరావాసం కల్పించడం, కుటుంబ సభ్యులను గుర్తించే ప్రయత్నాలు చేయడం, భద్రత, సంక్షేమం కోసం తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ రెండు కేసుల్లో సంబంధిత అధికారుల నివేదికల కోసం విచారణను జూలై 20, 2026కు వాయిదా వేసినట్లు కమిషన్ వెల్లడించింది.

# లోక్ అదాలత్‌లతోనే సత్వర న్యాయం జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి



**మెట్‌పల్లి, జూన్ 20 (ప్రజా మంటలు):** లోక్ అదాలత్‌ల ద్వారానే కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం మెట్‌పల్లి కోర్టులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పరస్పర రాజీ ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయంతో పాటు ఖర్చులు కూడా ఆదా అవుతాయని ఆమె పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కారమైన కేసులపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు. అనంతరం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 1,645 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో పరస్పర రాజీ ద్వారా 97, మీడియేషన్ ద్వారా 16, అడ్మిషన్ల ద్వారా 58, పీఎల్సీ ద్వారా 25, ఎస్టీసీ కేసులు 1,449 పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్యా రాజారాం, ఏపీపీ జి. ప్రణయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు వద్దేపల్లి శ్రీనివాసన్, జేడీ సుధాకర్, మీడియేషన్ సభ్యులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్ తదితరులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# రూ.800 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడండి

**తహసీల్దార్ ఆఫీస్ వద్ద బీఆర్ఎస్ నేతల ఆందోళన**



**సికింద్రాబాద్, జూన్ 20 ( ప్రజామంటలు):** కంటోన్మెంట్ పరిధిలోని బోయిన్‌పల్లి సర్వే నంబర్ 157/1లో ఉన్న సుమారు రూ. 800 కోట్ల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని, అక్కడే పేదల కోసం 6,000 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీఆర్ఎస్ నాయకులు తిరుమలగిరి ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ డాక్టర్ మన్నె క్రిశాంక్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ఈ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లనిస్తోందని తీవ్రంగా విమర్శించారు. గతంలో ఇదే స్థలంలో 6,000 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని కాంగ్రెస్ నాయకులే ప్రతిపాదించారని, అయితే ఇటీవల ఈ భూమి వ్యవహారంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు రూ. 5 కోట్లు అందాయనే ఆరోపణలు ఉన్నందునే ఇప్పుడు ఇళ్ల ప్రస్తావన చేయడం లేదని ఆయన ఆరోపించారు. గత 2023 ఆగస్టు 19న కొందరు కబ్జాదారులు ఈ భూమిలోకి చొరబడినప్పుడు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్వో ద్వారా ఫిర్యాదు చేయించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించి ప్రభుత్వ భూమిని కాపాడిందని క్రిశాంక్ గుర్తు చేశారు. కానీ ప్రస్తుత 2026లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రభుత్వ భూమిని కబ్జాదారులకు అప్పచెప్పడం దారుణమన్నారు. ఈ స్థలాన్ని షాపింగ్ మాల్ కోసం కాకుండా పేదలకు గృహాల నిర్మాణానికి మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. అధికారులు చట్టపరంగా పోరాడి ఆ భూమిని ప్రభుత్వానికే దక్కేలా చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనివ్వకుండా ప్రజా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నివేదిత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నగేష్, మాజీ కంటోన్మెంట్ బోర్డు సభ్యులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనిత, నళిని, కిరణ్, పాండు యాదవ్, శ్యామ్ కుమార్, టి.ఎన్. శ్రీనివాస్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 12 ఏండ్ల మోదీ నాయకత్వంలో దేశంలో చారిత్రాత్మక పురోగతి

**మీడియా ఇంటరాక్షన్ లో ఎంపీ డా.కే.లక్ష్మణ్**



**సికింద్రాబాద్, జూన్ 20 (ప్రజా మంటలు):** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని 12 ఏళ్ల పాలనలో దేశం సంక్షేమం, మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారతలో చరిత్రాత్మక పురోగతి సాధించిందని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ కొనియాడారు. కవాడిగూడలో శనివారం పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) నిర్వహించిన 'వార్త' మీడియా ఇంటరాక్షన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ లబ్ధి ఆధారిత పారదర్శక పథకాల వల్ల గత దశాబ్ద కాలంలో దేశంలో సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ఆయన వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణంగా సహకరిస్తోందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. గత 12 ఏళ్లలోనే రాష్ట్రంలో రూ. 1.20 లక్షల కోట్లతో 5 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించామని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, వందే భారత్ రైళ్లు, బడ్జెట్‌లో ప్రకటించిన హైస్పీడ్ రైలు కారిడార్లు రాష్ట్ర రైల్వే రంగానికి కేంద్రం ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. మామునూర్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధికి కూడా కేంద్రం నిధులు సమకూరుస్తోందని, వికసిత భారత్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు కస్తూరి రాకా సుధాకర్ రావు మాట్లాడుతూ.. 'మన్ కీ బాత్', డిజిటల్ వేదికల ద్వారా ప్రధాని మోదీ ప్రజలతో ప్రత్యక్షంగా అనుసంధానమయ్యారని, అయితే సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పీఐబీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాల పెంపు కోసమే దేశవ్యాప్తంగా పీఐబీ ఈ 'వార్త' వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోందని, ప్రజలకు నమ్మకమైన సమాచారాన్ని చేరవేయడంలో మీడియా భాగస్వామ్యం కావాలని కోరారు. ఈసందర్భంగా ప్రధానిగా మోదీ 12 ఏండ్ల పాలనపై తెలుగులో అనువాదం చేసిన బుక్స్ ను ఎంపీ లక్ష్మణ్ ఆవిష్కరించారు.

# లోక్ అదాలత్ ల ద్వారానే కక్షిదారులకు సత్వర న్యాయం

**మెట్టుపల్లి జూన్ 20 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** లోక్ అదాలత్ ల ద్వారానే కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి అన్నారు. మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం మెట్టుపల్లి కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరస్పరం కక్షిదారులు సమస్యని రాజీ చేసుకోవడం వల్ల సమయంతో పాటూ ఖర్చులు కూడా ఆదా అవుతాయాని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ అయినా కేసుల్లో అప్పీల్ కూడా ఉండదని తెలిపారు. అనంతరం నిర్వహించిన రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ లో మొత్తం 1645 కేసుల్ని పరిష్కారం చేసారు. ఇట్టి కేసుల్లో పరస్పరం రాజీ ద్వారా 97, మీడియాషన్ ద్వారా 16, అడ్మిషన్స్ ద్వారా 58, పియల్సి ద్వారా 25, ఎస్టీసీ ద్వారా 1449 లు ఉన్నాయి. అడ్మిషన్స్ ద్వారా రూపాయలు 4, 56, 200 లను కక్షిదారులు చెల్లించారు. పియాల్సి ద్వారా బ్యాంకులకు రూపాయలు 6, 78, 629 లను రైతులు చెల్లించారు. ఈ కార్యక్రమం లో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, ఏపీపి జి. ప్రణయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి, లోక్ అదాలత్ మెంబెర్స్ వద్దేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, మీడియాషన్ సభ్యులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్య, గడ్డం శంకర్ రెడ్డి, పోలకొండ దయాకర్ వర్మ, పుప్పాల భానుమూర్తి, వేముల సునీల్, పసునూరి సుదర్శన్, మామిడిపల్లి విజయలక్ష్మి, పడిగేల శ్రీనివాస్, గజ భీంకర్ వెంకటేష్, నీరటి రమణ, మార్క వంశీ, తలారి రాజశేఖర్, కోల అశోక్, ద్యావని సత్యనారాయణ, అందె సంజయ్ కుమార్, తుల రాజేందర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# గాంధీ మెడికల్ కాలేజీ ఏడీ గా శ్రీనివాస్



**సికింద్రాబాద్,జూన్ 20 ( ప్రజామంటలు):** గాంధీ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా జీ. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. గత ఆరేళ్లుగా నల్గొండ మెడికల్ కాలేజీలో ఏడీగా పనిచేసిన ఆయన, 42 ఏళ్ల ప్రభుత్వ సేవా అనుభవం కలిగి ఉన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సమయపాలనతో, చిత్తశుద్ధితో పనిచేస్తూ కళాశాలలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# జర్నలిస్ట్ దారుణ హత్యపై ఎన్హెచ్ఆర్సీ సీరియస్

**పోలీస్ అధికారులకు విచారణకు ఆదేశం**

**హక్కుల కమిషన్ కు అడ్వకేట్ రామారావు ఫిర్యాదు**



**సికింద్రాబాద్,జూన్ 20 ( ప్రజామంటలు):** చిత్తూరు జిల్లాలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురికావడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్హెచ్ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. ఈ ఘోర హత్యకాండ పై ప్రముఖ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన ఫిర్యాదును కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఏప్రిల్ 29న నమోదైన ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించిన కమిషన్, ఈ కేసులో ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' సమర్పించాలంటూ చిత్తూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ)ను ఆదేశించింది. రాబోయే నాలుగు వారాల్లోగా ఈ ఘటనపై సమగ్ర నివేదికను అందజేయాలని స్పష్టం చేస్తూ నోటీసులు జారీ చేసింది. గత ఏప్రిల్‌లో చిత్తూరు జిల్లాలో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిని దుండగులు పట్టపగలే వేటకొడవళ్లతో కిరాతకంగా నరికి చంపిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయనతో పాటు ఉన్న 'ప్రజాశక్తి' జర్నలిస్ట్ సుబ్రహ్మణ్యంపై కూడా నిందితులు దాడి చేయడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రాంతంలో ఇసుక, భూమి, ఆయిల్ మరియు ఎర్రచందనం మాఫియాల అక్రమాలను నిరంతరం వెలికితీస్తున్న జర్నలిస్టుల ప్రాణాలకు రక్షణ కరవైందని న్యాయవాది రామారావు తన ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఈ ఘోరానికి ఒడిగట్టిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో స్థానిక పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆయన కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్ట్ హత్య కేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్, తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# ఇందిరమ్మ ఇళ్లును ప్రారంభించిన ఎమ్మెల్యే



**జగిత్యాల రూరల్, ప్రజా మంటలు, ( జూన్ 20);** జగిత్యాల మండల కల్లెడ గ్రామానికి చెందిన రాచకొండ లక్ష్మీ ఎల్లయ్య దంపతుల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి కానుకగా చీర ను అందజేసారు. వెంట సర్పంచ్ గంగోత్రి పరశు రామ్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, పాక్స్ చైర్మెన్ సందీప్ రావు, మాజీ సర్పంచులు మహేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీ రాజన్న , ఎంపివో రవి బాబు, నాయకులు బాల ముకుందం నక్కల రవీందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ గొల్లపల్లి రాజన్న, రమేష్, అంజి, మంచాల శ్రీనివాస్‌సర్పంచులు, నాయకులు, గ్రామ ప్రజలు, యువత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జగిత్యాల మండల అంతర్గం వద్దెర కాలని గ్రామంలో బోదాసు లావణ్య నర్సయ్యల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి కూడా ఆయన హాజరై చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# పోలీసులు శారీరక,మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

**చిలకలగూడ పోలీసులకు గాంధీ డాక్టర్ అవేర్నెస్**



**సికింద్రాబాద్, జూన్ 20 ( ప్రజా మంటలు):** విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని చిలకలగూడ ఏసీపీ కే. శశాంక్ రెడ్డి సూచించారు. వారాసిగూడలోని చిలకలగూడ డివిజన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి వైద్యులు ప్రొఫెసర్ జలగం తిరుపతిరావు మాట్లాడుతూ.. వ్యాయామం, యోగా, ధ్యానం, సమతుల్య ఆహారం, తగిన నిద్రతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ప్రతిరోజు కొంత సమయాన్ని యోగా,శారీరక వ్యాయమానికి కేటాయించాలన్నారు. చిలకలగూడ లోని సుమారు 70 మంది పోలీసు అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మధ్యానికి బానిసై మనస్థాపన చెంది ఆత్మహత్య



**ఇబ్రహీంపట్నం జూన్ 20 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన జంగిలి పెద్దోళ్ల చిన్న నర్సయ్య తండ్రి పెద్దోళ్ల పెద్ద నర్సయ్య ,43 సం.లు,కులం. మున్నూరు కాపు, అనునతను గత కొంతకాలంగా మధ్యానికి బానిసై ప్రతిరోజు మద్యం తాగి ఇంటికి వస్తున్న గా తరచు అతనికి అతని భార్య అయినా జంగల్ కవిత మధ్య గొడవలు జరిగేవి, మృతుడికి ఇద్దరు కూతుర్లు జంగిలి నితిషా 17 సంవత్సరాలు మరియు జంగిలి నందిగా 15 సంవత్సరాలు సంతానం కలరు, వారికి ఇంకా వివాహం అవ్వలేదని రోజు నువ్వు ఇలా తాగి వస్తే ఎలా అని అతని భార్య అయిన కవిత అతని మందలించగా దానికి మనస్థాపన చెందిన మృతుడు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోని దూలానికి నైలాన్ తాడు తో ఉరి పెట్టుకొని మరణించినాడని ఇట్టి మృతుడి మరణ పై ఎవరికి ఎవరిపైన ఎలాంటి అనుమానం లేదని మృతుడి అన్న కొడుకు అయిన జంగిలి నితీష్ తండ్రి. నర్సయ్య,26 సం.లు అనునతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నవీన్ తెలిపారు,

# రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదు

**మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ప్రజా మంటలు ( జూన్ 20):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదని మాజీ మంత్రి, బి.ఆర్.ఎస్. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెరుగైన పాలనా అందిస్తామని అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి, హామీలు మరిచి అసలుకే ఎసరు పెట్టారని అన్నారు. రాష్ట్రానికి కెసిఆర్ నాయకత్వం అవసరం ఉందన్నారు. వరంగల్ లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ చేశారని, 2 లక్షలు రుణ మాఫీ చేస్తామన్నారు,కొంతమందికి అసలే మాఫీ కాలేదని వివరించారు. వరిలో ఏ రకమైన ధాన్యానికి అయినా బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి సన్నలకు మాత్రమే బోనస్ అంటున్నారని ఎద్దేవా చేశారు. బోనస్ ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందన్నారు. మార్కెట్ లో డిమాండ్ ఉన్న ధాన్యం రకం ప్రభుత్వం ప్రకటించి సాగు చేయమనడం ఏంటన్నారు. కేంద్రం అనుమతించిన మేరకే పంటలు కొనుగోలు చేస్తామని అంటే.. మీరు ఎందుకు అంటూ.... నిలదీశారు. దేశంలో ఎక్కడా కూడా యూరియా కొనుగోలుకు యాప్ లేదు. కేవలం తెలంగాణలో మాత్రమే రైతులను గోస పోసుకునేందుకు ఆప్ తీసుకు వచ్చారని ఆరోపించారు. ప్రభుత్వం ధాన్యం సేకరణలో వైఫల్యం..రుణమాఫీ లో..., రైతు భరోసా చెల్లింపులో...., ఇలా అన్నింట్లో విఫలం అయిందన్నారు. కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడ లేని విదంగా రైతు బీమా అమలు చేశారు. రేవంత్ రెడ్డి మాత్రం రైతు భరోసా.. ఎగ్గొడుతున్నారనీ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో 7600 మంది రైతులు భీమా కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. బీమా ప్రీమియం చెల్లించలేక ఎగ్గొట్టే కుట్ర చేస్తున్నదన్నారు. పంటల బీమా పథకం అమలు లేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు అతి లేదు.. గతి లేదు.. అని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ...రైతు వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. కెసిఆర్ పాలనలో రైతులకు రైతు బంధు, బీమా పెద్దపీట వేశారని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా రైతులకు అండగా నిల్చిన జీవన్ రెడ్డి కాంగ్రెస్ ను వీడడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ దోపిడిని నిలదీస్తాం.. కేసులకు భయపడేది లేదు... రైతులకు అండగా నిలుస్తాం.. అన్నారు. రైతులకు బీ ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. రైతుల వెన్నంటి ఉంటామన్నారు. కెసిఆర్ పాలనలో రైతుల పక్షాన ఢిల్లీలో ఉద్యమించి, కేంద్రం మెడలు వంచినం అన్నారు. మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ దావా వసంత మాట్లాడుతూ..బీ ఆర్ ఎస్ పాలనలో రైతే రాజు గా కేసీఆర్ పాలన సాగిందన్నారు. రైతులను దేశానికి వెన్నుముకగా నిజం చేసి చూపించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల కు వెన్నుపోటు పొడుస్తున్నారని విమర్శించారు. చెరువులు పునరుద్ధరించి, కుల వృత్తులు ప్రోత్సహించారు. అస్సలు ఈ ప్రభుత్వంలోవ్యవసాయ శాఖ ఉన్నట్టా లేనట్టా.. అని ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ హరిచరణ్ రావు, రాయికల్ మున్సిపల్ చేర్మెన్ కటుకం రవీందర్, జగిత్యాల మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, గాజుల రాజేందర్, కల్లేపల్లి దుర్గయ్య, మాసర్తి రమేష్ , రాదకిషన్, మహిపాల్, మల్లేష్ , శీలం సురేందర్, అబ్దుల్ భారీ,రియాజ్ ఖాన్, నేహాల్,రాకేష్ నాయక్, శ్రీధర్, రూప, అనురాధ, తిరుపతి, ఆనంద్ రావు, ప్రణయ్ వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ పై నుండి పడి వ్యక్తి మృతి



**గొల్లపల్లి జూన్ 20ప్రజా మంటలు :** ఎండపల్లి గ్రామానికి చెందిన తోట్ల మధుకర్ 26 సంలు, రాత్రి వ్యవసాయ పొలానికి పెంట తిసుకపోవడానికి అదే గ్రామానికి చెందిన వర్దవెల్లి కొమురయ్య కు చెందిన ట్రాక్టర్ కిరాయికి మాట్లడుకొని, అందులో పెంట నింపుకొని, వ్యవసాయ పొలానికి వెళ్తుండగా, వెళ్ళే సమయంలో ట్రాక్టర్ నొగలు మీద నిల్చొని ఉండగా, ట్రాక్టర్ అతివేగంగా, నడుపడం వల్ల, మధుకర్ కింద పడగా, కనుబొమ్మ పైన చాతిపైన గాయాలు కలుగడంతో, చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి, తరలించగా, డాక్టర్ పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు లో భాగంగా మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ,పి ఉదయ్ కుమార్ తెలిపారు

# జగిత్యాలలో 120 గ్రాముల గంజాయి స్వాధీనం నిందితుడు అరెస్ట్




**జగిత్యాల, జూన్ 20 (ప్రజా మంటలు):** జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ శివార్లలో గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో రూరల్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామానికి చెందిన దగ్గు రాజేష్ వద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి, అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# నకిలీ ట్రక్ చిట్టీలతో రూ.91 లక్షల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం

**ఆరుగురు నిందితుల అరెస్ట్.. రూ.14.16 లక్షల నగదు స్వాధీనం, రూ.46.21 లక్షల ఖాతాలు ఫ్రీజ్**

**సిరిసిల్ల, జూన్ 20 (ప్రజా మంటలు):** ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ ట్రక్ చిట్టీలు సృష్టించి సుమారు రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో ఆరుగురు నిందితులను సిరిసిల్ల టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాం మేనేజర్ ఉత్కం విజయ్ (ఏ1), వాసాల గణేష్ (ఏ5) కలిసి ఐకేపీ కేంద్రాల నుంచి ధాన్యం వచ్చినట్లు నకిలీ ట్రక్ చీటీలు సృష్టించినట్లు విచారణలో తేలింది. రుద్రంగి ఐకేపీ కేంద్రం ఇన్‌చార్జి గడ్డం స్వామి (ఏ3) జారీ చేసిన నకిలీ ట్రక్ చీటీలను సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి విడుదలైన నిధులను పరస్పరం పంచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. డీఎంఓ కార్యాలయ మండల స్థాయి కో-ఆర్డినేటర్ కమ్మరి రాజశేఖర్ (ఏ2), బద్దెనపల్లి పీఏసీఎస్ కేంద్రం ఇన్‌చార్జి గాజుల నవీన్ (ఏ6) సహకారంతో మరో నకిలీ ట్రక్ చీటీ రూపొందించి ప్రభుత్వ నిధులను అక్రమంగా పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అలాగే వివిధ ఐకేపీ కేంద్రాల నుంచి వచ్చిన 10 లారీల ధాన్యాన్ని గోదాంలో దించకుండానే ఆన్‌లైన్‌లో దించినట్లు నమోదు చేసి, అనంతరం ఆ ధాన్యాన్ని చెపూరి మధుకర్ (ఏ4) ద్వారా వివిధ రైస్ మిల్లులకు విక్రయించినట్లు గుర్తించారు. జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎస్. నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో ఏ1 ఉత్కం విజయ్, ఏ2 కమ్మరి రాజశేఖర్, ఏ4 చెపూరి మధుకర్, ఏ5 వాసాల గణేష్, ఏ6 గాజుల నవీన్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, సంబంధిత పత్రాలు, రూ.14.16 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా రూ.46.21 లక్షలను వారి బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరింత దర్యాప్తు కొనసాగుతోందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# హైదరాబాద్‌కు వర్ష సూచన


**పలు జిల్లాలకు పిడుగుల హెచ్చరిక**

**హైదరాబాద్ సహా పలు తెలంగాణ జిల్లాలకు ఉరుముల వర్ష సూచన**

**నగరంలోని ఘట్‌కేసర్, ఉప్పల్, హయత్‌నగర్ ప్రాంతాల్లో ఇప్పటికే వర్షం**

**ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ**

**ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం**






తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకోవడంతో పాటు, ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, యాదాద్రి-భువనగిరి, నల్గొండ, జనగామ, సూర్యాపేట జిల్లాల్లో రాబోయే కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగర శివార్లలోని నారపల్లి, రాంపల్లి, ఘట్‌కేసర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, హయత్‌నగర్, నాగోల్ వంటి ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు కురిశాయి. రాత్రికి నగరం అంతటా వర్షాలు విస్తరించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భారత వాతావరణ శాఖ సూచనల ప్రకారం, పిడుగులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం సాయంత్రం 4:30 గంటల సమయంలో నగరంలో 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో పాటు అధిక తేమ నమోదైందని, ఇటువంటి వాతావరణం పరిస్థితులు వర్షాలకు అనుకూలమని నిపుణులు తెలిపారు. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి.

